సాక్షి
నాగర్‌కర్నూల్
శనివారం । 16 । నవంబర్ । 2024

పీయూ అభివృద్ధికి సహకరించండి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధికి సహకరించాలని వీసీ జీఎన్ శ్రీనివాస్ శుక్రవారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మంత్రిని వీసీ మర్యాద పూర్వకంగా కలిసి యూనివర్సిటీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. మంత్రిని కలిసిన వారిలో రిజిస్ట్రార్ చెన్నప్ప, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి తదితరులున్నారు.



గరిష్టం/కనిష్టం
35.0 /20.6

వాతావరణం

ఉదయం, సాయంత్రం చలి ఉంటుంది. కొద్దిమేర ఆకాశం మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

సమావేశానికి హాజరుకండి

నాగర్‌కర్నూల్: వెనకబడిన **తరగతుల కులాల** అభివృద్ధి, సామాజిక, **రాజకీయ, ఆర్థిక విశ్లే**షణ చేసేందుకు రాష్ట్ర **బీసీ కమిషన్ చైర్మన్** బి.నిరంజన్ నేతృత్వంలో **సోమవారం మహ**బూబ్‌నగర్ కలెక్టరేట్‌లో **సమావేశం కాను**న్నట్లు నాగర్‌కర్నూల్ కలెక్ట**ర్ బదావత్ సంతోష్** శుక్రవారం ఒక ప్రక**టనలో తెలిపారు.** జిల్లాలోని వెనకబడిన **తరగతుల కులాలు** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, సంచార జాతుల వారి సామాజిక, రాజకీయ, ఆర్థిక విశ్లేషణపై ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని, జిల్లా ప్రజలు బీసీ కమిషన్ చైర్మన్, బృందం సభ్యులకు తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి హాజరు కావాలన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



నాగర్‌కర్నూల్ రూరల్: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో బీసీ రిజర్వేషన్ అంశానికి చర్యలు చేపట్టి కులగణన సర్వే నిర్వహించి.. జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్‌లు పెంచాలని, ముదిరాజుల జనాభాకు తగిన వాటా ఇవ్వాలని ముదిరాజు మహాసభ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని పాత కలెక్టరేట్ ఎదుట ముదిరాజు మహాసభ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవాలు, వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొట్టమొదటిసారి ముదిరాజులే మత్స్యకారులు అనే నినాదంతో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం నవంబర్ 21న నిర్వహిస్తున్నామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు కల్పించాలని, ఉత్తరాసి, తెనుగొల్లు, ముదిరాజు బీసీ డీ నుంచి ఏలోకి చేర్చాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు సూచనల ప్రకారం రాష్ట్ర బీసీ కమిషన్ ఆదేశాలు జారీ చేసి హామీలను అమలు చేయాలన్నారు. చెరువులు, కుంటల్లోని మత్స్య సంపదపై ఈ కులాలకు మాత్రమే హక్కులు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యాదగిరి, మల్లేష్, మత్స్యకార కోఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షుడు అల్లోజి, డైరెక్టర్లు భానుచందర్, వెంకటయ్య, మంజుల, బంగారయ్య, సైదులు, వెంకటస్వామి పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

పాన్‌గల్: రైతులు దళారులను నమ్మి మోసపోకుండా పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి, చిక్కేపల్లి, శాగాపూర్, కదిరెపాడు, మాధవరావుపల్లి, బహుదూర్‌గూడెం, బండపల్లిలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను మండల నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తుందని, గ్రామాల్లో ప్రైవేట్ వ్యాపారులు తిరుగుతున్నారని, వారిని నమ్మి మోసపోవద్దని కోరారు.

బక్క చిక్కిన చేప..

సబ్సిడీ చేపపిల్లల సైజుపై మంత్రి జూపల్లి కృష్ణారావు అభ్యంతరం

- సోమశిల వద్ద కృష్ణానదిలో వదిలేందుకు తెచ్చినవి వెనక్కి పంపిన వైనం
- నిబంధనల ప్రకారమే విడుదల చేస్తున్నామన్న మత్స్యశాఖ ఏడీ
- జిల్లాలో నత్తనడకన సాగుతున్న కార్యక్రమం
- నెలాఖరులోగా లక్ష్యం మేరకు పంపిణీపై అనుమానాలు



చేపపిల్లలు

గతేడాది విడుదల చేసిన చేపపిల్లలు : 2.58 కోట్లు	ఈ ఏడాది చేపపిల్లల పంపిణీ లక్ష్యం : 1.50 కోట్లు రిజర్వాయర్లు 5
చెరువులు, కుంటలు 1,260	ఇప్పటి వరకు చెరువుల్లో వదిలినవి 55 లక్షలు

కొల్లాపూర్: మత్స్యకారుల జీవనోపాధిని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వంద శాతం సబ్సిడీపై నీటి వనరుల్లో చేపపిల్లలు విడుదల చేస్తోంది. ఇందుకోసం నిర్ణీత లక్ష్యాన్ని నిర్దేశించుకొని మత్స్యశాఖ అధికారులు కార్యక్రమాలు చేపడుతుంటారు. అయితే ప్రతి సంవత్సరం అక్టోబర్ నెలాఖరు నాటికి చేపపిల్లల విడుదల ప్రక్రియను పూర్తిచేసే మత్స్యశాఖ అధికారులు ఈ ఏడాది మాత్రం నత్తనడకన నిర్వహిస్తున్నారు. ఇందుకు పలు రకాల కారణాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

ఆంధ్ర నుంచి దిగుమతి

జిల్లాలో చేపపిల్లలు వదిలే కాంట్రాక్టు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ వ్యాపారితోపాటు తెలంగాణకు చెందిన ఓ వ్యాపారి సంయుక్తంగా తీసుకున్నారు. అయితే తెలంగాణకు చెందిన వ్యాపారి చేపపిల్లల సప్లయ్‌లో నిర్లక్ష్యం చేయడంతో విడుదలలో ఆలస్యమవుతోందని అధికారులు చెబుతున్నారు. ఆంధ్ర వ్యాపారి పంపుతున్న వాటినే రెండు దఫాలుగా అధికారులు నీటి వనరుల్లో విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో గత నెల 7న జిల్లాలో చేపపిల్లల విడుదల ప్రారంభమవగా.. ఈ నెల 2 వరకు పూర్తిచేయాలని భావించారు. కానీ, చేపపిల్లల సప్లయ్‌లో ఆలస్యం కారణంగా నిర్ణీత గడువును ఈ నెలాఖరు వరకు పెంచారు.

మంత్రి జూపల్లి అసంతృప్తి

ఇటీవల సోమశిల సమీపంలోని కృష్ణానదిలో చేపపిల్లలు వదిలేందుకు మత్స్యశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును ఆహ్వానించారు. అయితే కొందరు మత్స్యకారులు చేపపిల్లల సైజు కొలవాలని విజ్ఞప్తి చేయగా.. కొన్ని మాత్రమే 80 మి.మీ.,కి పైగా ఉన్నాయి. దీంతో నిర్ణీత సైజులో చేపపిల్లలు లేనందున వాటిని తిప్పిపంపాలని, లేదంటే చెరువుల్లో వదలాలని మత్స్యశాఖ అధికారులకు మంత్రి సూచించారు.

లక్ష్యం చేరేనా..?

మత్స్యశాఖ అధికారులు జిల్లాలో చేపపిల్లల విడుదల లక్ష్యాన్ని పూర్తిచేస్తారో లేదోననే సంశయం మత్స్యకారుల్లో నెలకొంది. జిల్లాలో 1.50 కోట్ల చేపపిల్లలు వదలాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 55 లక్షలు మాత్రమే వదిలారు. మత్స్యశాఖ అధికారులు, సొసైటీల మధ్య సమన్వయ లోపం, చేపపిల్లల సప్లయ్‌లో ఆలస్యం ఇందుకు కారణాలుగా తెలుస్తోంది. నవంబర్ 17 వతేదీలోగా టార్గెట్‌ను పూర్తిచేయాలని అధికారులు భావించారు. సోమశిల ఘటన తర్వాత చేపపిల్లల సైజు తప్పనిసరిగా నిబంధనల ప్రకారం ఉండాలని మత్స్యశాఖ అధికారులు కాంట్రాక్టర్‌కు సూచించారు. దీంతో నిర్ణీత గడువులోగా చేపపిల్లల సప్లయ్ జరుగుతుందా.. లేక ఆలస్యమవుతుందా అనే సందిగ్ధంలో మత్స్యకారులు ఉన్నారు.

నిబంధనలు పాటిస్తున్నాం..



చేపపిల్లల విడుదలలో అన్ని నిబంధనలు పాటిస్తున్నాం. కాంట్రాక్టర్ సప్లయ్ చేసే చేపపిల్లలను మత్స్యశాఖ సహకార సంఘం సభ్యులు పరిశీలిస్తున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశానుసారం సోమశిలకు తీసుకువచ్చిన చేపపిల్లలను వెనక్కి పంపాం. సైజుల విషయంలో తేడాలు ఉండొద్దని కాంట్రాక్టర్‌కు సూచించాం. లక్ష్యం మేరకు 1.50 కోట్ల చేపపిల్లల్ని ఈ నెలాఖరులోగా నీటి వనరుల్లో వదిలేందుకు చర్యలు చేపట్టాం.

– రజిని, జిల్లా మత్స్యశాఖ అధికారి

రకాలు, సైజులు ఇలా..

మత్స్యశాఖ అధికారులు నీటి వనరుల్లో వదిలే చేపపిల్లల రకాలు, సైజులు నిబంధనల ప్రకారం ఉండాలి. చెరువుల్లో బొచ్చ, రవుట, బంగారుతీగ రకం చేపపిల్లలు, కాల్వలు, పారే నీటిలో బొచ్చ, రవుట, మోసు రకం, రిజర్వాయర్లలో బొచ్చ, రవుట, బంగారు తీగ, మోసు రకాలు వదిలిపెట్టాలి. చెరువులు, కాల్వల్లో వదిలే చేపపిల్లలు 3.5 – 4 సెం.మీ., రిజర్వాయర్లలో వదిలేవి 8– 10 సెం.మీ., పొడవు ఉండాలి. సరాసరిన వీటిని తూకం వేస్తే కిలో 180 నుంచి 300 లోపు చేపపిల్లల వరకు రావాలి. చేపపిల్లలను ఎగుమతి చేసేటప్పుడు అవి ఆరోగ్యంగా ఉన్నాయా.. లేదా అనేది మత్స్యశాఖ సొసైటీల సభ్యులు పరిశీలించాలి. వాటిని వదిలేటప్పుడు సైజులు చూడవచ్చు. అక్కడ విడిచిపెట్టే చేపపిల్లల సంఖ్య ఆధారంగా మత్స్యశాఖ అధికారులు బిల్లులు చెల్లిస్తారు.

ఉమామహేశ్వర ఆలయంలో ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కార్తీక కాంతులు

పవిత్రమైన కార్తీక మాసం, పౌర్ణమి కలిసిరావడంతో శుక్రవారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. జిల్లాలోని ప్రధానమైన సోమశిల సోమలింగేశ్వరస్వామి, ఉమామహేశ్వరం, గుండాల అంబారామలింగేశ్వరస్వామి, నాగర్‌కర్నూల్‌లోని రామాలయం, మద్దిమడుగు అంజన్న, వట్టెం వెంకన్న ఆలయాల్లో తెల్లవారుజామునే ప్రత్యేక పూజలు నిర్వహించి.. కార్తీక దీపాలు వెలిగించారు. అలాగే పాతాళగంగ, సోమశిల వద్ద కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి తరించారు. – సాక్షి నెట్‌వర్క్

వివరాలు 10లో..

రాగింగ్ కలకలం

పాలమూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో వెలుగులోకి..

- గోడకుర్చీలు వేయించడంతో జూనియర్ల మనస్తాపం
- 10 మంది సీనియర్ వైద్య విద్యార్థుల సస్పెన్షన్
- యాంటీ ర్యాగింగ్ కమిటీ పనితీరుపై విమర్శలు
- తూతూమంత్రంగా అవగాహన కార్యక్రమాలు
- పోలీస్‌శాఖ చొరవ చూపాలని సూచిస్తున్న విద్యారంగ నిపుణులు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పాలమూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్ వ్యవహారం కలకలం సృష్టిస్తోంది. సీనియర్ మెడికోలు అది, ఇది అంటూ జూనియర్లకు పని చెప్పడం.. చేయకపోతే గోడ కుర్చీలు వేయించడం వంటి చర్యలకు పాల్పడినట్లు ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ మేరకు ర్యాగింగ్‌కు పాల్పడిన పదిమంది సీనియర్ వైద్య విద్యార్థులను 20 రోజుల పాటు సస్పెన్షన్ వేటు వేశారు. అయితే ఈ ఘటనపై అధికారులు చెరోమాట మాట్లాడుతుండడం అనుమానాలకు తావిస్తోంది. ర్యాగింగ్‌కు పాల్పడినట్లు తేలడంతో సదరు విద్యార్థులకు పనిష్మెంట్ ఇచ్చామని అంటుండగా.. మరో అధికారి ఆల్కహాల్ సేవించి రావడంతో చర్యలు తీసుకున్నామని చెబుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కమిటీ ఉన్నట్లా.. లేనట్లా.. ?

కళాశాలలో ర్యాగింగ్ ఘటన చోటుచేసుకున్న నేపథ్యంలో యాంటీ ర్యాగింగ్ కమిటీ పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యాంటీ ర్యాగింగ్ కమిటీలో వైద్యకళాశాలతో పాటు పోలీస్ తదితర ప్రభుత్వ శాఖల అధికారులు మెంబర్లుగా ఉంటారు. వీరు ఎన్జీఓలు, మీడియా, విద్యార్థులు, తల్లి దండ్రు ల భాగస్వామ్యంతో ర్యాగింగ్ నివారణకు సమష్టిగా కృషి చేయాల్సి ఉంటుంది. కానీ.. ఇలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన దాఖలాలు లేవని విద్యార్థులే చెబుతున్నారు. కొత్తగా తరగతులు ప్రారంభమైన క్రమంలో తప్పకుండా విద్యార్థులతో సమావేశమై ర్యాగింగ్‌పై అవగాహన కల్పించాల్సి ఉంది. ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటివరకు అలాంటి కార్యక్రమం జరగలేదని తెలిసింది. ఇప్పటికైనా పోలీస్‌శాఖ చొరవ చూపి ర్యాగింగ్ భూతాన్ని ఆదిలోనే తరిమికొట్టాలని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు.

గోడ కుర్చీలు వేయించడంతో..

పాలమూరు మెడికల్ కళాశాలలో 2024–25 బ్యాచ్ తరగతులు ఇటీవల ప్రారంభమయ్యాయి. 175 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు ఇటీవల ఫస్టియర్‌లో చేరారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ఎదిర సమీపంలో ఉన్న కళాశాల క్యాంపస్‌లో 2023 బ్యాచ్‌కు చెందిన కొందరు సీనియర్లు.. కొత్తగా వచ్చిన జూనియర్లపై పెత్తనం చెలాయించేందుకు ప్రయత్నించారు. సుమారు రెండు వారాలుగా వారితో ఏదో ఒక పని చేపిస్తూ వచ్చారు. అయితే పది రోజుల క్రితం రాత్రి తాము చెప్పిన పని చేయడం లేదని పలువురు జూనియర్లను గోడ కుర్చీలు వేయించారు. మనస్తాపానికి గురైన జూనియర్లు.. సదరు సీనియర్ వైద్య విద్యార్థులపై కళాశాల డైరెక్టర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్..

సీనియర్లపై జూనియర్లు ఫిర్యాదు చేయగా.. డైరెక్టర్ రమేష్ స్వయంగా రంగంలోకి దిగి విచారణ చేశారు. నిజమేనని తేలడంతో పది మంది సదరు సీనియర్ వైద్య విద్యార్థుల తల్లిదండ్రులను ఈ నెల పదో తేదీన కళాశాలకు పిలిపించారు. వారి సమక్షంలోనే ఆ విద్యార్థులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆ తర్వాత సదరు పది మంది విద్యార్థులను క్రమశిక్షణ చర్యల కింద డిసెంబర్ ఒకటో తేదీ వరకు సస్పెండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సదరు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులతో లెటర్లు రాయించుకున్నట్లు తెలిసింది.




పాలమూరు ప్రభుత్వ వైద్య కళాశాల

ఉపేక్షించేది లేదు.. కఠినంగా వ్యవహరిస్తాం..

పాలమూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ అనేది ఇప్పటి వరకు లేదు. ఈ ఘటనే మొదటిది. ర్యాగింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు. కఠినంగా వ్యవహరిస్తాం. పదిమంది సీనియర్ వైద్య విద్యార్థులకు పనిష్మెంట్ కింద 20 రోజుల పాటు ఇంటికి పంపించాం. దీనిపై డీఎంఈకి నివేదిక అందజేస్తాం. ముందు ర్యాగింగ్ అనే పదం కళాశాలలో వినిపించొద్దు. ర్యాగింగ్ నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టి.. పకడ్బందీ చర్యలు తీసుకుంటాం. రాత్రి వేళల్లో వసతి గృహాల వద్ద వార్డెన్లు, ఇతర సిబ్బందికి విధులు కేటాయించాం.

– డాక్టర్ రమేష్, ప్రభుత్వ వైద్య కళాశాల డైరెక్టర్

త్వరలోనే ర్యాగింగ్‌పై ప్రత్యేక సదస్సు



మెడికల్ కళాశాలలో త్వరలోనే ర్యాగింగ్‌పై ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తాం. ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై సెక్షన్–4 కింద కేసులు నమోదు చేస్తాం. ఆరు నెలల నుంచి నుంచి ఏడాది జైలు శిక్ష, రూ.10వేల జరిమానా ఉంటుంది. ఇప్పటికే రూరల్ పోలీసు సిబ్బంది రాత్రి వేళల్లో గస్తీ తిరగడానికి ఆదేశాలు ఇచ్చాం. మెడికల్ కళాశాల ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదు. ఇప్పటికే కళాశాల డైరెక్టర్‌తో ఈ విషయంపై చర్చించడం జరిగింది.

– వెంకటేశ్వర్లు, డీఎస్పీ

ఆదివాసీల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి



గిరిజన సంప్రదాయ దుస్తుల్లో నృత్యం చేస్తున్న విద్యార్థులు

నాగర్‌కర్నూల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని గిరిజనులు ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. దర్తీ అబా బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ప్రత్యేక ప్రసారం కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి, జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ, డీపీఓ రామ్మోహన్ రావు, డీవైఎస్ఓ సీతారాంనాయక్, గిరిజన ఆదివాసీ నాయకులు, మహిళలు, విద్యార్థులు పాల్గొని ప్రధాని ప్రసంగాన్ని వీక్షించారు. అంతకు ముందు కలెక్టరేట్‌లో కలెక్టర్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొమురం భీం, బిర్సాముండా, రాంజీ గోండుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన ఆదివాసీల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. గిరిజన పాఠశాలల విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన నృత్యాలు ప్రతిఒక్కరిని ఆకట్టుకున్నాయి. కళాకారులు గిరిజన నాయకుల త్యాగాలపై పాటలు పాడి ఉత్సాహపరిచారు.



ప్రధాని మోదీ ప్రసంగాన్ని వింటున్న కలెక్టర్ బదావత్ సంతోష్ తదితరులు

హత్యలతో హడల్

జిల్లాలో కలకలం రేపుతున్న వరుస ఘటనలు

- మానవత్వం మరిచి కిరాతకంగా హతమారుస్తున్న వైనం
- క్షణికావేశంలో జరుగుతున్న ఘటనలే అధికం
- అవగాహన కల్పించి చైతన్యపరిస్తేనే అడ్డుకట్ట



నాగర్‌కర్నూల్ క్రైం: నిండు నూరేళ్లు బతకాల్సిన కుటుంబాల్లో.. జీవితాంతం తోడునీడగా ఉండాల్సిన భార్యాభర్తలు అనుమానంతో కొందరు.. ఆస్తి కోసం క్షణికావేశంలో మరికొందరు.. మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ఇంకొందరు అత్యంత కిరాతకంగా హత్యలకు పాల్పడుతూ తమ జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారు. గత కొద్ది నెలలుగా జిల్లాలో ఎక్కడో ఒకచోట హత్యలు చోటుచేసుకుంటుండటంతో ప్రజల్లో అభద్రతాభావం నెలకొంది. అలాగే జిల్లాలో వరుసగా జరుగుతున్న హత్యా ఘటనలు కలకలం రేపుతున్నాయి.

22 పోలీస్‌స్టేషన్ల పరిధిలో..

జిల్లాలోని 22 పోలీస్‌స్టేషన్ల పరిధిలో గత రెండేళ్లగా జరుగుతున్న హత్యలను పరిశీలిస్తే ఒకింత భయం వేస్తోంది. ఇటీవల కాలంలో జిల్లా పరిధిలో చోటుచేసుకుంటున్న హత్యలు వివాహేతర సంబంధంతో, క్షణికావేశంలో చోటుచేసుకుంటున్నవే ఎక్కువగా ఉన్నాయి. 2023 సంవత్సరంలో మొత్తం 32 హత్యలు చోటుచేసుకోగా 32 కేసులను పోలీసులు ఛేదించారు. అలాగే 2024 సంవత్సరంలో ఇప్పటి వరకు 27 హత్యలు జరగగా.. 27 హత్య కేసుల్లో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అవగాహన కల్పించాల్సి అవసరం

జిల్లా పరిధిలో జరుగుతున్న హత్యలతో ప్రజల్లో నెలకొన్న భయాన్ని తగ్గించడం కోసం నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల పరిధిలోని పోలీస్ శాఖ ద్వారా నేరాలకు పాల్పడితే జరిగే పరిణామాలపై, విధించే శిక్షల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు నేరాలకు పాల్పడితే విధించే శిక్షల పట్ల అవగాహన కలిగి ఉంటేనే హత్యలు, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలు తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. అలాగే క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతో తీవ్ర ఇబ్బందులు ఎదురవడమే కాకుండా.. హత్యలకు పాల్పడి తల్లిదండ్రులు తమ పిల్లలకు దూరమవుతారన్న విషయం మరిచిపోతున్నారు. క్షణికావేశంలో జరిగే హత్యలతో పిల్లలు అనాథలుగా మారిపోయి సమాజంలో చిన్నచూపునకు లోనవుతారనే విషయాన్ని ప్రతిఒక్కరు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది.

ఆయా సంఘటనలు ఇలా..

- జూన్ 22న తెలకపల్లి మండల అనంతసాగర్‌లో భర్తను రోకలిబండతో కొట్టి భార్య హతమార్చిన సంఘటన చోటుచేసుకుంది.
- జూన్ 28న నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడన్న కారణంతో భర్తను భార్య హత్య చేసింది.
- ఈ నెల 7న వెల్దండ మండలం ఎంజీతండాలో వివాహేతర సంబందానికి అడ్డుగా ఉన్నాడని ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తను ప్రియుడు, మరో వ్యక్తితో కలిసి భార్య హతమార్చింది.
- ఈ నెల 10న తిమ్మాజిపేట మండలం రాళ్లచెరువుతండాలో తోడబుట్టిన అన్న భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకోవడమే కాకుండా అడ్డుగా అన్న ఉన్నాడని తమ్ముడు అన్నను హత్య చేసిన సంఘటన కలకలం రేపింది.

అవగాహన కల్పిస్తాం..



జిల్లా పరిధిలో జరిగిన హత్యలు క్షణికావేశంతో, అవగాహన లోపంతో జరుగుతున్నవే ఎక్కువగా ఉన్నాయి. నేరాలు చేస్తే జరిగే పరిణామాలపై, శిక్షలపై పోలీస్‌శాఖ తరఫున ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తాం. చట్ట పరిధిని దాటి ఎవరైనా నేరాలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తాం.

– గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎస్పీ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

కోస్గి: పొలం నుంచి ఇంటికి వెళ్తున్న ఓ వృద్ధుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందిన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం సలీంపూర్‌కు చెందిన గోపాల్ (56) గ్రామ శివారులోని పొలానికి వెళ్లి పనులు ముగిసిన తర్వాత స్వగ్రామానికి బయలుదేరాడు. దౌల్తాబాద్–కోస్గి రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా అటుగా వెళ్తున్న కొందరు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఓ ప్రైవేట్ వాహనంలో కోస్గి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

స్వగ్రామానికి వెళ్తుండగా..


బాలరాజు (ఫైల్)

కొత్తకోట రూరల్: షాద్‌నగర్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వనపర్తి జిల్లా కొత్తకోట మండలం సత్యహళ్లికి చెందిన ఓ వ్యక్తి మృతిచెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బాలరాజు (42) కుటుంబంతో కలిసి కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటూ మేస్త్రీ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. శుక్రవారం హైదరాబాద్ నుంచి బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా.. షాద్‌నగర్ సమీపంలో కర్ణాటకకు చెందిన బొలెరో వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలరాజుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి వద్ద ఉన్న భవన నిర్మాణ కార్మిక సంఘం గుర్తింపుకార్డు ఆధారంగా స్థానికులు గ్రామస్తులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హుటాహుటిన షాద్‌నగర్‌కు బయలుదేరారు. బాలరాజుకు భార్య సుగుణ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల స్టేజీ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. సుమారు 45 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి కొన్నాళ్లుగా మూసాపేట పరిసరాల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడు. గురువారం రాత్రి 44వ నంబర్ జాతీయ రహదారిపై వెళ్తుండగా కర్నూలు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలుకాగా పోలీసులు, స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కాసేపటికే మృతిచెందాడు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చామని.. మరిన్ని వివరాల కోసం ఠాణాలో సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు. ఇదిలా ఉండగా ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు అదుపులోకి తీసుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

గొల్లపల్లిలో అనుమానాస్పద మృతి..


బంకల ఎల్లస్వామి (ఫైల్)

గోపాల్‌పేట: వనపర్తి జిల్లా రేవల్లి మండలం గొల్లపల్లికి చెందిన బంకల ఎల్లస్వామి (42) మృతిపై అనుమానం ఉందని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు.. గొల్లపల్లికి చెందిన బంకల ఎల్లస్వామి బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో గురువారం కుటుంబ సభ్యులు రేవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. శుక్రవారం ఉదయం కేశంపేట ఆశ్రమం సమీపంలో ఉన్న కలుజువాయి బావిలో మృతదేహం కనిపించడంతో రైతులు గుర్తించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎల్లస్వామి మృతిపై అనుమానం ఉందని కుటుంబ సభ్యులు చెప్పడంతో ఆ కోణంలో విచారణ చేపడుతున్నట్లు వివరించారు.

విద్యుదాఘాతంతో ..


నేనావత్ గన్యా(ఫైల్)

రాజాపూర్(బాలానగర్): ఇంటి నిర్మాణం పనులు చేస్తుండగా విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన చిన్నరేవల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవి వివరాల ప్రకారం.. పెద్దచెల్కతండాకు చెందిన నేనావత్‌గన్యా(52) చిన్నరేవల్లి గ్రామానికి చెందిన కొల్లూరి శ్రీకాంత్ కొత్త ఇంటి నిర్మాణం పనులు చేస్తున్నాడు. ఇంటి వెలివేషన్ పనులకు 8 ఎంఎం ఇనుప సీకు పైనున్న 11 కేవీ విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే అక్కడే ఉన్న వారు చికిత్సనిమిత్తం షాద్‌నగర్‌కు తరలించగా, డాక్టర్ పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నాడు. అతని భార్య కమ్లీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



అలంపూర్‌లోని జోగుళాంబ ఆలయం వద్ద తుంగభద్రనది, బీచుపల్లి వద్ద కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కార్తీక వెలుగులు..


గద్వాల జిల్లాకేంద్రంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


గుండాలలోని అంబారామలింగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

- అలంపూర్ తుంగభద్ర, బీచుపల్లి, సోమశిల, పాతాళగంగ వద్ద కృష్ణానదిలో పుణ్యస్నానాలు
- భక్తులతో కిక్కిరిసిన ఉమ్మడి జిల్లాలోని ఆలయాలు

జోగుళాంబ శక్తిపీఠం: కార్తీకమాసం పరమ పవిత్ర మాసం కావడంతో భక్తులు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, తీర్థాలు దర్శించారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి కావడంతో ఉమ్మడి జిల్లా పరిధిలోని తుంగభద్రనది తీరాన ఉన్న అలంపూర్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి, పాపనాశేశ్వర ఆలయం, రాజోలి వైకుంఠ నారాయణస్వామి ఆలయాలు, మరోవైపు కృష్ణానది తీరాన వెలసిన బీచుపల్లి ఆంజనేయస్వామి, చింతరేవుల, మక్తల్ పంచదేవపాడు దత్తక్షేత్రం, సోమశిల, పాతాళగంగ వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. అలాగే ప్రముఖ ఆలయాలైన మన్యంకొండ, చిన్నరాజమూరు, కురుమూర్తి, మద్దిమడుగు, ఉమామహేశ్వరం, సింగోటం, పాలెం వేంకటేశ్వరస్వామి, శ్రీరంగనాథస్వామి, గుండాలలోని అంబారామలింగేశ్వరస్వామి తదితర ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఉదయాన్నే ఆలయాలకు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించి.. దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.


భక్తులతో కిక్కిరిసిన సోమశిలలోని సోమేశ్వరాలయం


జోగుళాంబ ఆలయం ఎదుట దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కృత్తికోత్సవం.. జ్వాలాతోరణం


తుంగభద్ర తీరంలో జ్వాలాతోరణం నిర్వహిస్తున్న అర్చకులు

- జోగుళాంబ ఆలయంలో ఆకట్టుకున్న విశేష పూజలు
- భక్తుల చేత సహస్ర దీపాలంకరణ
- తుంగభద్రకు నదీ హారతులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్‌లోని జోగుళాంబ ఆలయంలో శుక్రవారం ప్రదోశకాలంలో నిర్వహించిన విశేష పూజలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో జోగుళాంబ అమ్మవారి ఆకృతిలో రంగవల్లికలు వేసి వాటిపై దీపాలు వెలిగించారు. ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు భక్తులకు ప్రమిదలు, నూనె, ఒత్తులు ఉచితంగా అందజేశారు. వాటిపై భక్తులు దీపాలు వెలిగించడంతో దేదీప్యమానంగా వెలుగొందాయి. అమ్మవారి ఆలయం చుట్టూ రథోత్సవాన్ని ఊరేగించారు. అలాగే పల్లకీలో అమ్మ, స్వామివార్ల దేవతామూర్తుల విగ్రహాలను పుష్కరఘాట్‌కు చేర్చారు. అక్కడ తుంగభద్ర నదీమతల్లికి అర్చకులు దశవిధ హారతులు ఇచ్చారు. అలాగే జ్వాలాతోరణం ఏర్పాటు చేసి దేవతామూర్తుల విగ్రహాలను ఊరేగించారు.

వర్షంతో తీవ్ర ఆటంకం

అలంపూర్‌లో శుక్రవారం సాయంత్రం అకస్మాత్తుగా వర్షం కురిసింది. దీంతో ఒకవైపు నదీ హారతి, మరోవైపు జ్వాలాతోరణానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. అప్పటికే ఆలయ ప్రాంగణంలో భక్తులు పెద్దఎత్తున దీపాలు వెలిగించడంతో వర్షం పడి ప్రాంగాణమంతా అసౌకర్యంగా మారి భక్తులు ఇబ్బందులు పడ్డారు. దీంతో జ్వాలా తోరణం, నదీహారతులను అతికష్టంగా ముగించారు. ఇది లా ఉండగా కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని జోగుళాంబ గద్వాల జిల్లా ప్రిన్సిపల్ జడ్జి కుశ, జూనియర్ సివిల్ జడ్జి మిథున్‌తేజ, సీఐ రవిబాబు తదితరులు ఆలయాలను దర్శించుకున్నారు. జ్వాలాతోరణం కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు.

వీఐపీల పేరుతో భక్తులకు ఇబ్బందులు

వీఐపీలకు పెద్దపీట వేస్తూ భక్తులను గంటల కొద్ది ఆపడం ఏమిటని భక్తులు ఒక్కసారిగా ఆగ్రహావేశాలు వెళ్లగక్కారు. క్యూలైన్‌లో రెండు గంటలు ఆపుతారా అంటూ భక్తులు ఆలయ సిబ్బందితో ఘర్షణకు దిగారు. ఆలయంలో వ్యాపారం చేస్తున్నారా.. మూసివేయండి అంటూ ఊగిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే విజయుడు ఆలయానికి రావడంతో వీఐపీ ట్రీట్‌మెంట్ పేరిట ఆలయ మర్యాదలతో తీసుకెళ్లారు. దీంతో భక్తులను కాసేపు నిలిపివేయడంతో అసౌకర్యానికి వాగ్వాదానికి దిగారు. అలాగే ప్రదోశకాలం కావడంతో అభిషేకం చేసే సమయంలో ఎప్పటిలాగే గర్భాలయంలో పరదా వేశారు. ఈ విషయం తెలియని భక్తులు వీఐపీలకు అభిషేకాలు చేస్తున్నారంటూ ఆలయ అర్చకులపై మండిపడ్డారు.

తొక్కిసలాటలో పలువురికి గాయాలు


తోపులాడుకుంటున్న భక్తులు

కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి అలంపూర్ జోగుళాంబ ఆలయంలో నిర్వహించిన జ్వాలాతోరణంలో అత్యుత్సాహం కారణంగా అపశ్రుతి చోటుచేసుకుంది. జ్వాలాతోరణం వెలిగించిన అనంతరం దేవుడిని పల్లకీలో కూర్చోబెట్టి జ్వాలాతోరణం కింద నుంచి తీసుకెళ్తారు. కాగా భగవంతుడి పల్లకీతోపాటు జ్వాలా తోరణం కింద వెళ్లేందుకు భక్తులు పోటీ పడ్డారు. దీంతో ఒకవైపు తోరణం కింద జ్వాలగా మంట మీద పడుతుండటంతో భక్తులు జ్వాలాతోరణం కిందపడగా.. ఒకరినొకరు తొక్కుకుంటూ వెళ్లడంతో పలువురికి గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన సీఐ రవిబాబు, ఎస్‌ఐ వెంకటస్వామి, విజయ్, ఆలయ ఈఓ పురేందర్, ధర్మకర్త నాగశిరోమణి కిందపడిన భక్తులను పక్కకు లాగడంతో పెను ప్రమాదం తప్పింది.

కొనసాగుతున్న కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు


జాతర మైదానంలో భక్తుల రద్దీ

- కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని భారీగా తరలివచ్చిన భక్తులు
- దీపాలు వెలిగించి మొక్కులు చెల్లింపు

చిన్నచింతకుంట: అమ్మాపురం కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రాజ గోపురం, ప్రధాన మెట్లు, ప్రధాన ఆలయం, ఆలయ సమీపంలోని జమ్మిచెట్టు, అమ్మవారి ఆలయం తదితర ప్రాంతాల్లో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు దీపాలు వెలిగించేందుకు సిబ్బంది వసతులు కల్పించారు. అనంతరం జాతర మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయాల్లో సామగ్రి కొనుగోలు చేశారు.


ఆలయంలో మహబూబ్‌నగర్, నారాయణపేట న్యాయమూర్తులు

స్వామివారిని దర్శించుకున్న న్యాయమూర్తులు..

మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు చెందిన సీనియర్ సివిల్ న్యాయమూర్తులు రాధి, వింధ్య శుక్రవారం కురుమూర్తిస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

40 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ఖిల్లాఘనపుర: మండలంలోని తిర్మలాయపల్లి గేటు వద్ద పోలీసుల తనిఖీలో 40 బస్తాల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడు తెలిపారు. శుక్రవారం ఉదయం నిర్వహించిన తనిఖీలో మహబూబ్‌నగర్ రోడ్డు నుంచి ఖిల్లాఘనపురం వైపు వెళ్తున్న బులెరో వాహనంలో గొల్ల ప్రవీణ్ 40 బస్తాల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. బియ్యంపై ఆరా తీయగా మహబూబ్‌నగర్ గంజిలో రఫిక్ దగ్గర నుంచి తెస్తున్నట్లు పేర్కొన్నాడు. ఖిల్లాఘనపురం మండలం సోళీపురం గ్రామానికి చెందిన కార్తీక్‌కు బియ్యం అమ్మడానికి తీసుకెళ్తున్నట్లు చెప్పాడు. బియ్యం వాహనాన్ని పట్టుకుని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం ఇవ్వగా డీటీ నందకిశోక్ అక్కడికి చేరుకొని బియ్యాన్ని పరిశీలించారు. డీటీ ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై, మహబూబ్‌నగర్‌కు చెందిన రఫిక్, సోళీపురం గ్రామానికి చెందిన కార్తీక్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. బియ్యం బస్తాలను వనపర్తి గోదాంకు తరలించినట్లు డీటీ తెలిపారు.

తిమ్మాపురంలో..



ఎర్రవల్లి: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన సీతానాయుడు గుడిసెలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు నమ్మదగిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది తనిఖీ చేశారు. 18 బస్తాల (8క్వింటాళ్ల) రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం వాటిని సివిల్ సప్లై కార్యాలయానికి తరలించారు. అధికారి మహర్షి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నెట్టెంపాడుకు కొనసాగుతున్న నీటి పంపింగ్

ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో ఒక పంపులో నీటి పంపింగ్ కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం ప్రాజెక్టుకు 2,711 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 609 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 71 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 957 క్యూసెక్కులు, కుడి కాల్వకు 368 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 100 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2,005 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.357 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

నిండుకుండలా రామన్‌పాడు జలశయం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగుల మేర ఉంది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 820 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 1,190 క్యూసెక్కులు, కుడి ఎడమ కాల్వ ద్వారా 25 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

సాంబారు గిన్నెలో పడి బాలుడు మృతి


జగదీశ్ (ఫైల్)

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలికలోని పైపాడుకు చెందిన ఓ బాలుడు సాంబారు గిన్నెల్లో పడి మృతిచెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వీరేశ్, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు జగదీశ్ (6) ఉన్నారు. వీరు బతుకుదెరువు కోసం కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం ఎంగోడుకు వలస వెళ్లారు. అదే గ్రామంలో వారి బంధువుల ఇంట్లో శుభకార్యం జరుగుతుండగా కుటుంబసభ్యులంతా కలిసి వెళ్లారు. జగదీశ్ తండ్రితో సెల్‌ఫోన్ తీసుకొని చూస్తూ గుడిసెలోకి వెళ్లి అప్పుడే తయారుచేసిన సాంబార్ గిన్నెపై కూర్చుని అందులో పడిపోయాడు. బాలుడి కేకలు విన్న బంధువులు వెంటనే బయటకు తీసి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. శుక్రవారం సాయంత్రం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

టీ-20 లీగ్ చాంపియన్‌లో జిల్లా క్రికెటర్ల ప్రతిభ


విజేత కంబైన్డ్ డిస్ట్రిక్ట్ జట్టుతో హెచ్‌సీఏ కార్యదర్శి, ఎండీసీఏ ప్రతినిధులు తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో శుక్రవారం జరిగిన హెచ్‌సీఏ ఏ1 డివిజన్ టీ–20 లీగ్ కమ్ నాకౌట్ టోర్నమెంట్‌లో కంబైన్డ్ డిస్ట్రిక్ట్ (తెలంగాణ ఉమ్మడి జిల్లాల) జట్టు చాంపియన్‌గా నిలిచింది.ఈ టోర్నమెంట్‌లో కంబైన్డ్ జట్టు తరుపున ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు పాల్గొని సత్తాచాటారు. జిల్లాకు చెందిన గణేష్ కెప్టెన్‌గా వ్యవహరించిఈ టోర్నీలో ఆరు మ్యాచులు ఆడి 201 పరుగులు చేయడంతో పాటు 5 వికెట్లు తీశాడు. టి.అరుణ్‌కుమార్ ఆరు మ్యాచుల్లో 13 వికెట్లు, డేవిడ్ క్రిపాల్ ఆరు మ్యాచులు ఆడి 78 పరుగులు చేయడంతో పాటు 2 వికెట్లు తీశాడు. మరో క్రీడాకారుడు జైసింహ రెండు మ్యాచ్‌లు ఆడి 2 వికెట్లు తీశాడు. విజేత కంబైన్డ్ డిస్ట్రిక్ట్ జట్టుకు హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజ్ ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, కోచ్ గోపాలకృష్ణతోపాటు వివిధ జిల్లాల క్రికెట్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నల్లబెల్లం పట్టివేత.. కేసు నమోదు

తెలకపల్లి: మండలంలోని వట్టిపల్లిలో గురువారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లాన్ని పట్టుకొని కేసు నమోదు చేశామని టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్యలక్ష్మి తెలిపారు. ఆమె కథనం మేరకు.. సుధాకర్, ప్రతాప్ అనే వ్యక్తులు అక్రమంగా 600 కిలోల నల్లబెల్లం, 50 కిలోల పటికను టాటా ఇంట్రా పికప్ వాహనంలో పెద్దకొత్తపల్లి నుంచి వివిధ గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. వట్టిపల్లి వద్ద వాహన తనిఖీల్లో పట్టుబడగా వాహనం, బెల్లాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ వివరించారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ అరుణ, కానిస్టేబుళ్లు రాఘవేందర్, రవీందర్‌గౌడ్, మహేశ్ పాల్గొన్నారు.

రాష్ట్ర బాస్కెట్‌బాల్ జట్టు మేనేజర్‌గా ఫారుఖ్



మహబూబ్‌నగర్ క్రీడలు: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాజనగాంలో ఈ నెల 18వ తేదీ నుంచి 22 వరకు జరిగే ఎస్‌జీఎఫ్‌ఐ అండర్–17 బాలుర జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర బాలుర జట్టుకు మేనేజర్‌గా ఉమ్మడి జిల్లాకు చెందిన మహ్మద్ ఫారుఖ్ ముకర్రం (పీడీ జెడ్పీహెచ్–ఉర్దూ, ఆత్మకూర్) నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ముకర్రం బాస్కెట్‌బాల్ క్రీడాకారుడిగా గతంలో పలుసార్లు రాష్ట్ర, జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారు. అదేవిధంగా ఆలిండియా సివిల్ సర్వీస్‌సె క్రీడల్లో రాష్ట్ర జట్టు తరపున ఆడారు. జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లలో పాల్గొనే రాష్ట్ర జట్లకు ఇప్పటివరకు ఐదుసార్లు కోచ్‌గా వ్యవహరించారు.

నేషనల్ బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారుడు



మహబూబ్‌నగర్ క్రీడలు: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాజనగాంలో ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు జరిగే 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 జాతీయస్థాయి బాలుర బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన కె.ద్రోణదత్తా ఎంపికయ్యాడు. గత నెలలో మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని తెలంగాణ జట్టులో చోటు దక్కించుకున్నాడు. జిల్లా క్రీడాకారుడు జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికకావడంపై జిల్లాకు చెందిన సీనియర్ క్రీడాకారులు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.